

నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి, బీజేపీ శ్రేణుల ప్రతిఘటనతో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితి

# బీజేపీ ఆఫీసుపై యూత్ కాంగ్రెస్ దాడి

## ఒకరి తలకు గాయం.. కొద్దిసేపు ఉద్రిక్తత

సుల్తాన్‌బజార్, జనవరి 7: కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ నాయకుడు రమేశ్ బిదూరీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ నేతలు నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై మంగళవారం దాడికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు ఎదురుదాడికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయం పైకి రాళ్లు విసరగా, బీజేపీ శ్రేణులు కర్రలతో అడ్డుకొన్నారు. ఈ ఘటనలో బీజేపీకి చెందిన ఓ కార్యకర్త తలకు గాయమైంది. ఇంతలో అక్కడికి భారీ ఎత్తున చేరుకున్న పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. ఈ దాడిని టీపీసీసీ తీవ్రంగా పరిగణించింది. యూత్ కాంగ్రెస్ నేతలు ఇలా మరో రాజకీయ పార్టీ కార్యాలయంపైకి వెళ్లడం సరైంది కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఈ దాడిని బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఖండించారు. దుర్మార్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు.



కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్ వద్ద బీజేపీ కార్యకర్తల ఆందోళన, చించేసిన ఫ్లెక్సీలు, అడ్డుకుంటున్న పోలీసులు

# ఆర్థిక సంస్కర్త పీవీ నరసింహారావు

## కొనియాడిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రవీంద్రభారతి, జనవరి 7: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప ఆర్థిక సంస్కరణ వాది అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. రవీంద్రభారతిలో మంగళవారం పీవీ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పీవీ నరసింహారావు స్మారక పురస్కార' ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ స్మారక అవార్డును అనువాద రచయిత నలిమెల భాస్కర్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ప్రజాకవి కాళోజీ స్వాతంత్య్ర సమరయోధుడిగా దేశానికి సేవలందించారని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు, కాళోజీనారాయణరావులు గొప్ప రచయితలుగా, గురుశిష్యులుగా పేరుప్రఖ్యాతులు సంపాదించారని కొనియాడారు. భారత్ దివాలా తీసే సమయంలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పీవీ ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ప్రగతిపథంలోకి నడిపించారని తెలిపారు. రాజకీయ విలువలు పాటించిన పీవీ నేటి యువతరానికి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కేవీ రామచంద్రారావు, సుబ్బిరామిరెడ్డి, పీవీ మనోహరరావు, పీవీ ప్రభాకరరావు, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు, సినీ సుస్వరాలు వీక్షకులను అలరించాయి.



రచయిత నలిమెల భాస్కర్‌కు పురస్కారాన్ని బహుకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

# ఐటీ, పీఆర్వోల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 7 (నమస్తేతెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల్లో 65 ఐటీ ఇన్‌స్ట్రక్టర్, 2 పీఆర్వో పోస్టులను భర్తీకి అధికారులు ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారు ఈ నెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టు వెల్లడించారు.

# బీజేపీ కార్యాలయంపై దాడి తప్పే

## టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్



హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడం తప్పేనని, ఇది సరైన పద్ధతి కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ నేతల దాడిని ఖండిస్తూ మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఓ రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడి చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. దాడికి పాల్పడిన యూత్ కాంగ్రెస్ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎవరికి చెప్పి, ఎవరి ఆదేశంతో దాడికి దిగారని మండిపడినట్టు సమాచారం.

# బీజేపీ ఆఫీస్‌పై దాడి హేయమైన చర్య

## సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

## ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్



సుల్తాన్‌బజార్, జనవరి 7: ధర్నా పేరుతో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై మంగళవారం కాంగ్రెస్ శ్రేణుల దాడి హేయమైన చర్య అని ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తమ సహనాన్ని పరీక్షించవద్దని, దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డీజీపీకి సూచించారు. రాష్ట్రంలో రక్షణ కొరవడిందని, లా అండ్ ఆర్డర్ ఎక్కడుందని? మీ పార్టీ కార్యకర్తలకు ఇతర పార్టీల కార్యాలయాలపై దాడి చేయాలని నేర్పిస్తున్నారా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అదే దాడి మేము చేస్తే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని తగులబెడ్తామని హెచ్చరించారు. నిరసన తెలిపేందుకు ఓ పద్ధతి ఉంటుందని తెలిపారు. గూండాయిజం చేసేవారికి గూండాయిజంతోనే సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. దాడులపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# శాంతి లేదు.. భద్రత కరువు!

- ప్రతి అంశంలోనూ ఇంటెలిజెన్స్ వైఫల్యం
- రాష్ట్రంలో అదుపుతప్పుతున్న శాంతిభద్రతలు
- డీజీపీ ఆఫీసు దగ్గర్లో కాంగ్రెస్, బీజేపీ దాడులు
- సాయంత్రం వరకూ అదుపులోకిరాని అల్లర్లు
- నిన్నటి ఘర్షణల వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం!

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అడుగడుగునా నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కొన్నాళ్లుగా ప్రజలకు శాంతి లేదు.. భద్రత అసలే లేదనే వాదన వినిపిస్తున్నది. వరుస వైఫల్యాలు, ఆరోపణలు చూస్తుంటే 'ఈ పోలీసు వ్యవస్థకు ఏమైంది?' అని పలువురు సందేహం వ్యక్తంచేస్తున్నారు. సిబ్బంది పనితీరును పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు అలసత్వం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### బజారెక్కిన బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు

అసెంబ్లీకి, డీజీపీ ఆఫీస్ సమీపంలోనే మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్లు, గుడ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఇరువర్గాల కార్యకర్తలకు రక్తమోడింది. ఇంత గొడవ జరిగినా సమయానికి బలగాలను దింపి, అల్లరిమూకలను చెదరగొట్టడంతో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### అధిష్ఠానం దృష్టిలో పడేందుకేనా?

కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంక గాంధీపై బీజేపీ ఢిల్లీ నాయకుడు చేసిన వ్యాఖ్యలే ఘర్షణకు దారితీశాయి. ధీటుగా స్పందించామని చెప్పుకునేందుకు ప్రభుత్వంలోని ముఖ్యమైన నేతలే బీజేపీ ఆఫీస్‌పై దాడి చేయించి ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. దాడుల వార్తలు జాతీయ మీడియాలో ప్రసారమయ్యాయి. బీజేపీ నేతలు కూడా గాంధీభవన్ వద్ద హంగామా సృష్టించారు.

### నిఘా వైఫల్యం.. నిత్యకృత్యం

- తెలంగాణలో నిఘా విభాగం అప్రమత్తంగా లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు కొన్ని ఘటనలను విశ్లేషకులు ఉదహరిస్తున్నారు.
- ఓ ఉగ్రవాది హైదరాబాద్‌లో 6నెలలు తలదాచుకున్నాడు. అతని ఉనికిని అంచనా వేయడంలో ఇంటెలిజెన్స్ పూర్తిగా విఫలమైంది. ఢిల్లీ నుంచి ఎన్ఐఏ అధికారులొచ్చి అతన్ని అరెస్టు చేశారు.
- కాంగ్రెస్ పాలనలో భైంసా, హైదరాబాద్ పాతబస్తీ, బోడుప్పల్, మెదక్, జైనూర్ సహా 9 చోట్ల మత ఘర్షణలు జరిగాయి.
- సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంపై దాడి జరిగింది. దాడికి ముందు ఇతర రాష్ట్రాలకు చెందిన 151 మంది ఒకే వర్గం యువకులు సికింద్రాబాద్‌లోని హోటల్లో 59 గదుల్లో మకాం వేయడం విస్మయానికి గురిచేసింది.
- నగరంలోని పలు చోట్ల వరుస దొంగతనాలు పాల్పడిన ముఠాలు చాలా ముందుగానే నగరంలోకి వచ్చాయి. కానీ పోలీసులు గుర్తించలేదు. రౌడీషీటర్ల మీద కూడా నిఘా లేకపోవడంతో హత్యలు, ఇతర నేరాలు పెరుగుతున్నాయి.
- వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారుల పర్యటన, రైతుల ఆందోళనలో నిఘా విభాగం విఫలమైంది. గత నవంబర్‌లో లగచర్ల, ఇతర తండాల ప్రజలు అధికారులపై దాడికి యత్నించారు.
- గత జూన్‌లో మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు పంచుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. జనం భూముల దగ్గరికి వెళ్లి, 3 రోజుల పాటు అక్కడే తిష్ట వేశారు. పరిస్థితి చివరకు రాళ్లదాడి-లాఠీచార్జికి దారితీసింది.
- గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనను అంచనా వేయడంలోనూ నిఘా విభాగం పూర్తిగా విఫలమైంది. పోలీసులు లాఠీలు, కర్రలతో అభ్యర్థులను కొట్టారు.
- బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి భార్యలు సచివాలయాన్ని ముట్టడించారు. హోంగార్డుల ఆందోళనను కూడా ఇంటెలిజెన్స్ అంచనా వేయలేకపోయింది.

చిత్రం

# అజిత్‌కు తప్పిన కారు ప్రమాదం



కార్ రేసింగ్ ట్రాక్‌పై జరిగిన ప్రమాదం నుంచి అగ్ర నటుడు అజిత్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ నెల 11, 12న దుబాయ్‌లో జరుగనున్న 24హెచ్ కార్ రేసింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆయన ఇటీవలే అక్కడకు వెళ్లారు. ప్రాక్టీస్ సమయంలో ఆయన నడుపుతున్న కారు అదుపు తప్పి బలంగా గోడను ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం మొత్తం డ్యామేజీ అయింది. వెంటనే భద్రతా సిబ్బంది ఆయన్ని మరో కారులోకి తరలించారు. ప్రస్తుతం ఈ ప్రమాదానికి సంబంధించిన విజువల్స్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఇదిలావుండగా అజిత్‌కు ప్రొఫెషనల్ రేసర్‌గా మంచి పేరుంది. విరామ సమయాల్లో కారు, బైక్ రేసింగ్స్‌ని ఎంజాయ్ చేస్తుంటారు. హైదరాబాద్, చెన్నై మధ్య ఆయన ఎన్నోసార్లు బైక్ టూర్ చేశారు. మోటార్ సైకిల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ఆయన ఓ సంస్థను కూడా ఏర్పాటు చేశారు. అజిత్ ప్రస్తుతం 'విదాముయార్చి' 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాల్లో నటిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం ఏప్రిల్ 10న విడుదలకానుంది.

# తెలంగాణ గ్రామదేవతల నేపథ్యంలో..



తెలంగాణ సంస్కృతి, బంధాలు, భావోద్వేగాల నడుమ సాగే బలమైన కథతో 'బలగం' తీసి, భారీ హిట్‌ను అందుకున్న దర్శకుడు వేణు యెల్దండి.. త్వరలో 'ఎల్లమ్మ' కథతో రానున్నారు. దిల్‌రాజు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నితిన్ కథానాయకుడు. కథానాయికగా సాయిపల్లవి దాదాపు ఖరారైనట్లు తెలుస్తున్నది. ఇటీవలే ఆమె కథ కూడా విన్నదట. 'బలగం' కథను మించిన ఎమోషన్స్ 'ఎల్లమ్మ'లో ఉంటాయని తెలుస్తున్నది. తెలంగాణ సంస్కృతిలో గ్రామ దేవతల ఆరాధన ఎక్కువగా కనిపిస్తుంది. ఇక్కడ ఎల్లమ్మ, పెద్దమ్మ, మైసమ్మ, పోశమ్మ.. ఇలా విభిన్నమైన నామాలతో గ్రామదేవతలు దర్శనమిస్తారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోనూ గంగానమ్మ, పోలేరమ్మ, అంకాళమ్మ.. ఇలా రకరకాల రూపాల్లో గ్రామదేవతలు పూజలందుకుంటున్నారు. ఈ గ్రామదేవతల నేపథ్యాన్ని తీసుకొని, వారిచుట్టూ తెలంగాణ నేపథ్యంలో దర్శకుడు వేణు యల్దండి ఈ కథ అల్లారని వినికిడి. అయితే.. ఇదేం భక్తిరస చిత్రం కాదు. 'బలగం'లా ఇదికూడా భావోద్వేగాల ప్రయాణమే. సాయిపల్లవి ఓ సినిమా ఒప్పుకుందంటే కచ్చితంగా అది గొప్పదై ఉంటుందనేది పలువురి అభిప్రాయం. మరి 'ఎల్లమ్మ' కథ ఎలా ఉంటుందో చూడాలి. ప్రస్తుతం స్క్రిప్ట్ పనుల్లో 'ఎల్లమ్మ' టీమ్ బిజీగా ఉంది. ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టనున్నారట. ఈ చిత్రానికి సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తున్నారు.

# శ్రీ తేజ్‌ను పరామర్శించిన అల్లు అర్జున్



హైదరాబాద్ సంధ్య థియేటర్ తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్ సికింద్రాబాద్ బేగంపేట్ మినిస్టర్ రోడ్డులో ఉన్న కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే మంగళవారం పుష్ప 2 సినిమా హీరో అల్లు అర్జున్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. అలాగే ఈ ఘటనలో మృతిచెందిన రేవతి భర్తను కూడా అల్లు అర్జున్ పరామర్శించారు. అల్లు అర్జున్‌తో పాటు నిర్మాత దిల్ రాజు కూడా ఉన్నారు. అల్లు అర్జున్ ఆసుపత్రికి వచ్చిన నేపథ్యంలో ఉత్తర మండలం పోలీసులు డీసీపీ సాధన రష్మీ ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్ద పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. అటు పేషంట్‌లకు, ఇటు అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మళ్లీ ఆసుపత్రికి రావాలంటే తమకు ఖచ్చితంగా సమాచారం అందించాలని అల్లు అర్జున్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు.

# బాలకృష్ణ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా




' 'డాకు మహారాజ్' రాబోయే రోజుల్లో పలు సినిమాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని బలంగా నమ్ముతున్నా. బాలయ్యగారి అభిమానులకు ఒక మెమరబుల్ ఫిల్మ్ ఇవ్వాలనేది నిర్మాత నాగవంశీ కల. అందుకు తగ్గట్టే సినిమా తీశాం. ఇందులో అయిదు యాక్షన్ సీక్వెన్సులుంటాయి. ప్రతి సీక్వెన్స్ అభిమానులకు హై ఇస్తుంది. వినోదంతో పాటు, హత్తుకునే ఎమోషన్స్ కూడా ఇందులో ఉంటాయి.' అని దర్శకుడు బాబీ కొల్లి అన్నారు. ఆయన దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా రూపొందిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు బాబీ మాట్లాడారు. ' 'డాకు మహారాజ్'ను రెండు తెలుగు రాష్ట్రాల్లో కావాల్సినన్ని థియేటర్లలో భారీగా విడుదల చేస్తున్నాం. యూఎస్‌లోనూ భారీస్థాయిలోనే విడుదల ఉంటుంది. అక్కడ బుకింగ్స్ కూడా బావున్నాయి. తెలుగుతోపాటు తమిళంలోనూ ఈ నెల 12నే సినిమా విడుదల కానుంది. సినిమా చూసి చెబుతున్నా.. 'డాకు మహారాజ్' అస్సలు నిరాశ పరచదు' అని నిర్మాత నాగవంశీ నమ్మకం వెలిబుచ్చారు.

# సల్మాన్ ఇంటికి బుల్లెట్‌ప్రూఫ్ రక్షణ



బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ తన వ్యక్తిగత రక్షణ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి ప్రాణహాని ఉన్న నేపథ్యంలో ముంబయి పోలీసులు సల్మాన్‌కు వై ప్లస్ భద్రతను సమకూర్చారు. మరిన్ని రక్షణ చర్యల్లో భాగంగా సల్మాన్‌ఖాన్ తన ముంబయి నివాసానికి బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఆయన నివాసం ఉండే గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌కు కొందరు కార్మికులు బుల్లెట్ ప్రూఫ్ బ్లూగ్లాస్‌ను అమర్చుతున్న ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. వరుస బెదిరింపుల నేపథ్యంలో సల్మాన్‌ఖాన్ షూటింగ్స్ పరంగా కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అవుట్‌డోర్ షూటింగ్స్‌కు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం సల్మాన్‌ఖాన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సికందర్' చిత్రంలో నటిస్తున్నారు. మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకురానుంది.

# నాగబంధం వెనకున్న రహస్యం



విరాట్‌కర్ణ హీరోగా నటిస్తున్న చిత్రం 'నాగబంధం'. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. మంగళవారం ప్రీలుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. 'పద్మనాభ స్వామి, పూరీ జగన్నాథ్ దేవాలయాల వద్ద కనుగొన్న గుప్త నిధుల వార్తల నుంచి ప్రేరణ పొంది.. ఆధ్యాత్మిక, సాహసభరిత అంశాలతో దర్శకుడు ఈ కథను సిద్ధం చేశారు. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం గురించిన ఆసక్తికరమైన అంశాలతో పాటు, దేశంలోని 108 విష్ణు దేవాలయాల చుట్టూ ఉన్న రహస్యాలను ఈ సినిమాలో ఆవిష్కరిస్తున్నాం. అత్యున్నత సాంకేతిక హంగులతో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలోని విజువల్స్ ప్రేక్షకుల్ని మరో ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నాం' అని మేకర్స్ తెలిపారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్, సంగీతం: అభే, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అభిషేక్ నామా.

# గూఢచారి సవాల్



సక్సెస్‌ఫుల్ స్పైథ్రిల్లర్ 'గూఢచారి'కి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం 'జీ2'. అడవి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటి వామికా గబ్బి భాగమైంది. ఇటీవలే అడివి శేష్‌తో కలిసి యూరోప్ షూటింగ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న వామికా ఈ సినిమా గురించి మాట్లాడుతూ 'సరికొత్త స్పైథ్రిల్లర్ ప్రపంచంలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర సవాలుతో కూడుకొని ఉంటుంది. తెలుగులో ఈ సినిమా నాకు మంచి బ్రేక్ నిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పింది. ఇమ్రాన్‌హష్మీ, మురళీశర్మ, సుప్రియా యార్లగడ్డ, మధుషాలిని తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు.

'పుష్ప-2'లోని 'కిస్సిక్..' పాటతో బాలీవుడ్‌లోనూ అభిమానుల్ని సంపాదించుకున్నది అందాలభామ శ్రీలీల.

# బాలీవుడ్‌లో మరో ఆఫర్?



అక్కడి నిర్మాతల కన్ను ఇప్పుడు ఈ తెలుగందంపై పడింది. ఇప్పటికే అక్కడ రెండు సినిమాలకు ఓకే చేసింది. త్వరలో మరో సినిమా చేయనున్నట్టు తెలుస్తున్నది. ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిల్మ్స్ ఆఫీస్‌లో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్‌తో శ్రీలీల మీడియాకు కనిపించిందట. దాంతో వీరిద్దరి కాంబినేషన్‌లో త్వరలోనే సినిమా రానున్నదని బీటౌన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. మాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కనున్నదని, దర్శకుడు, ఇతర వివరాలు తెలియాల్సివుందని వార్తలు వండేస్తున్నది బాలీవుడ్ మీడియా.



# అంచనాలు నిజమయ్యాయి

వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి తెరకెక్కించిన ప్రేమకథ 'డ్రింకర్‌సాయి'. ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించారు. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, లహరిధర్ బసవరాజు నిర్మాతలు. డిసెంబర్ 27న విడుదలైన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నదని మేకర్స్ చెబుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాకు ఈ సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. తాను అనుకున్న పాయింట్ ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యిందని, ఫలితం పట్ల అందరం ఆనందంగా ఉన్నామని, హీరోహీరోయిన్లతో పాటు ఇరవైమంది కొత్తవాళ్లను ఈ సినిమా ద్వారా పరిచయం చేశామని దర్శకుడు తెలిపారు. ఇప్పటివరకూ 5.75 కోట్ల గ్రాస్‌ను ఈ సినిమా కలెక్ట్ చేసిందని నిర్మాతలు తెలిపారు.